
సాక్షి శ్రీకాకుళం

శనివారం ✦ 9 ✦ ఆగస్టు ✦ 2025



పీజీ.. వెరీ లేజీ..!

పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశాలు ఆలస్య మవుతున్నాయి. ఫలితాలు విడుదలై నెలలు గడుస్తున్నా ప్రవేశాలు జరగక విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. - 8లో



మత్స్యకారుల నిరసన - 8లో

కెమికల్ ఫ్యాక్టరీ వల్ల మత్స్య సంపద నాశనమవు తోందని పోరాటం చేస్తున్న మత్స్యకారులపై నమోదైన తప్పుడు కేసులను ఎత్తివేయాలని మత్స్యకార ఎస్టీ సాధన సమితి డిమాండ్ చేసింది.

బురిడి కంచరాంలో చైన్ స్నాచింగ్

పొందూరు : బురిడి కంచరాం గ్రామంలో యార బాటి సూరప్పమ్మ అనే 75 ఏళ్ల వృద్ధురాలి మెడలో మూడు తులాల బంగారం తాడును శుక్రవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి తెంచుకుని పారి పోయినట్లు ఎస్సై వి.సత్యనారాయణ తెలిపారు. బురిడికంచరం-ఎస్ఎంపురం రోడ్డులో పొలానికి వెళ్తుండగా వెనుక నుంచి కారంపొడి చల్లి చోరీకి పాల్పడినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు.

న్యూస్‌రీల్

ఇచ్ఛాపురం తహసీల్దార్‌పై చర్యలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రస్తుతం ఇచ్ఛాపురం తహసీల్దారుగా పనిచేస్తున్న ఎస్.వెంకటరావుపై చర్యలకు సీసీఎల్ఏ డిపార్ట్‌మెంట్ చర్యలకు ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌కు ఉత్తర్వులు చేరాయి. ఈయన శ్రీకాకుళం తహసీల్దార్‌గా పనిచేసిన కాలంలో వీఆర్ఓ ముద్దాడ జయకృష్ణ 2023 డిసెంబర్ 15న ఫ్యామిలీ మెంబర్ ధ్రువపత్రం మంజూరులో లంచం అడిగినందుకు ఏసీబీకి పట్టుబడ్డాడు. దీని వెనుక తహసీల్దారు పర్యవేక్షణ నిర్లక్ష్యం, అవినీతిలో భాగం ఉందని ఏసీబీ అధికారులు రిపోర్టు ఇవ్వడంతో తాజాగా సీసీఎల్ఏ చర్యలకు ఆదేశించింది. పది రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

12న డీవార్మింగ్ డే



ఆల్బెండజోల్ దోసులను చూపిస్తున్న డీఎంహెచ్ఓ అనిత, ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటరావు

అరసవల్లి : రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం – పాఠశాల ఆరోగ్య పథకంలో భాగంగా ఈ నెల 12న నులిపురుగుల నివారణ దినోత్సవం (డీవార్మింగ్ డే) నిర్వహిస్తున్నామని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ కె.అనిత తెలిపారు. ఈమేరకు శుక్రవారం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వెంకటరావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 3296 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు 3,34,723 మందితో పాటు పాఠశాలలకు వెళ్లని వారు 2,715 మంది, 3358 అంగన్‌వాడీ కేంద్రాల్లో 73,820 మంది పిల్లలకు నులిపురుగుల నివారణకు గాను 5,03,800 ఆల్బెండజోల్ (400 మి.గ్రా) మాత్రలు ఇవ్వనున్నట్లు వివరించారు. ఇప్పటికే విద్యా సంస్థలకు దోసులు పంపిణీ పూర్తిచేసినట్లు తెలిపారు. 12న పూర్తి స్థాయిలో పిల్లలకు దోసులు ఇప్పిస్తామని, ఈ నెల 20న మ్యాప్‌అప్ డేగా మిగిలినవారికి దోసులు వేయిస్తామని చెప్పారు. మండలాల్లో పీహెచ్‌సీల వైద్యులు, ఎంపీడీఓలు, ఎంఈవోలు, సీడీపీవోలు, డీవీఈవో, సీఆర్‌పీల పర్యవేక్షణలో కార్యక్రమం జరగాలన్నారు. ప్రతి పాఠశాలలో ఆరోగ్య సిబ్బందిని పర్యవేక్షకునిగా నియమించామని ప్రకటించారు. మధ్యాహ్న భోజనం తర్వాత మాత్రలను మింగించాలని, ఎలాంటి దుష్ప్రభావాలుండవని, ఏదైనా జరిగితే సమీపంలో పీహెచ్‌సీకి వెంటనే తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు, అంగన్‌వాడీలు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

జీఐతోనే ఖాదీకి బహుళ ప్రచారం



ఖాదీ పరిశ్రమలను పరిశీలిస్తున్న కేవీఐసీ డిప్యూటీ సీఈవో మదన్‌కుమార్‌రెడ్డి

పొందూరు : ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పొందూరు ఆంధ్రా ఫైన్ ఖాదీ కార్మికాభివృద్ధి సంస్థకు భౌగోళిక గుర్తింపు(జీఐ) ద్వారానే బహుళ ప్రాచుర్యం లభిస్తుందని ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ కమిషన్(కేవీఐసీ, బెంగళూరు) సౌత్‌జోన్ డిప్యూటీ సీఈవో మదన్‌కుమార్ రెడ్డి అన్నారు. శుక్రవారం పొందూరులోని ఏఎఫ్‌కేకే సంఘాన్ని సందర్శించిన అనంతరం మాట్లాడారు. ఈ ఏడాది డిసెంబర్‌లో జీఐ వచ్చే అవకాశం ఉందని చెప్పారు. పొందూరు ఖాదీ సంస్థకు ఖాదీ ప్రమోషనల్ గ్రాంట్ నుంచి అవసరమైన పరికరాలు కొనుగోలుకు నగదు మంజూరు చేస్తామని తెలిపారు. వర్క్‌షెడ్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నామని చెప్పారు. ఖాదీ కార్మికులు తగ్గిపోతున్న నేపథ్యంలో కేవీఐసీ, పొందూరు ఏఎఫ్‌కేకే సంఘంతో కలిసి నేత, వడుకు కార్మికుల నైపుణ్యాన్ని పెంచేందుకు శిక్షణా కార్యక్రమం నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. సౌత్‌జోన్‌లో కేరళ, కర్నాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో 435 ఖాదీ సంస్థలు ఉన్నాయని, ఆల్ ఇండియా స్థాయిలో ప్రొడక్షన్ రూ.లక్షా 17వేలు కోట్లు కాగా సేల్స్ రూ.లక్షా70వేలు కోట్లు ఉందని వివరించారు. తిరుమలలో పొందూరు సన్నఖాదీ వస్త్రాల దుకాణం ఏర్పాటు అనుమతి కోసం టీటీడీ ఛైర్మన్, ఈవోలను సంప్రదించామని చెప్పారు. దేశంలోని ఖాదీ పరిశ్రమల అభివృద్ధికి గతంలో రూ.10వేల కోట్లతో ఉన్నతాధికారులు ఓ పథకాన్ని రూపొందించారని, అందులో పొందూరు ఖాదీకి ప్రత్యేక కేటాయింపులు ఉన్నాయని వెల్లడించారు. సంబంధిత పథకం అమలులోకి వస్తే పొందూరు ఖాదీ దిశ, దశ మారనుందని చెప్పారు. కార్యక్రమంలో కేవీఐసీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.గ్రీప్, ఏఎఫ్‌కేకే సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గుంటుకు ప్రసాద్, దండా వెంకటరమణ పాల్గొన్నారు.



బలగ సమీపంలోని బాలాత్రిపుర కాలభైరవపీఠం దేవాలయంలో శ్రీచక్రసిరిజ్యోతి పూజలు చేస్తున్న మహిళలు



నరసన్నపేటలోని వేంకటేశ్వర ఆలయంలో వరలక్ష్మీ అలంకరణలో స్వామివారు



శ్రీకాకుళం సత్యసాయి పెద్దమందిరంలో సామూహిక వ్రతాలు

● వరలక్ష్మీ వైభవం

శ్రావణ శుక్రవారం సందర్భంగా జిల్లాలో తెలుగు లోగిళ్లు వరలక్ష్మీ వ్రతాలతో కళకళలాడాయి. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు అధిక సంఖ్యలో హాజరై సామూహిక వ్రతాలు ఆచరించారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల ప్రసాదాలను నైవేద్యాలుగా సమర్పించారు.

–శ్రీకాకుళం కల్చరల్/నరసన్నపేట

విత్తనోత్పత్తి కేంద్రానికి.. మోక్షమెప్పుడో ?





నందిగాం మండలం బడబంద గ్రామంలో ప్రారంభానికి ఎదురుచూస్తున్న విత్తనోత్పత్తి కేంద్రం

- నిర్మాణం పూర్తయినా ప్రారంభానికి నోచుకోని వైనం
- మంత్రి అచ్చెన్న సొంత నియోజకవర్గంలో దుస్థితి
- రైతన్నలకు తప్పని ఎదురుచూపులు

నందిగాం : జిల్లాలో విత్తనోత్పత్తి కేంద్రానికి మోక్షం కలగడం లేదు. రైతులకు విత్తన కష్టాలు తీర్చాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వంలో టెక్కలి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పేరాడ తిలక్ కోరిక మేరకు అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నదాతలకు విత్తనాలు అందుబాటులో ఉండేలా విత్తనోత్పత్తి కేంద్రం మంజూరు చేశారు. అప్పటి వ్యవసాయశాఖ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద రూ.4 కోట్ల 70 లక్షలు మంజూరు చేసి ఏపీ విత్తనాభివృద్ధి సంస్థకు అప్పగించారు. దీనిలో భాగంగా నందిగాం మండలం శివరాంపురం పంచాయతీ బడబంద గ్రామంలో ఐదు ఎకరాల ప్రభుత్వ భూమి కేటాయించారు. ఏపీ విత్తనాభివృద్ధి సంస్థ నుంచి ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ నిర్మాణ బాధ్యతలను తీసుకొని పనులు పూర్తి చేసింది.

రైతన్నను పట్టించుకోని అచ్చెన్న..

కూటమి ప్రభుత్వం వచ్చాక విత్తనోత్పత్తి కేంద్రం వైపు పాలకులు కన్నెత్తి కూడా చూడకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కేంద్రం ప్రారంభమైతే స్థానిక రైతులతో విత్తనాలు తయారు చేయించి వాటిని మరలా ప్రభుత్వం కొనుగోలు చేసి వాటిని జిల్లా నలుమూలలకు పంపించే అవకాశం ఉంటుంది. తద్వారా జిల్లా రైతాంగం విత్తనాల కోసం ఇతర జిల్లాలపై ఆధార పడకుండా చేయవచ్చు. జిల్లాలో ఇది వరకే ఉన్న అంపోలు కేంద్రంతో పాటు ఈ కేంద్రం కూడా వినియోగంలోకి వస్తే రానున్న రోజుల్లో జిల్లా రైతాంగానికి కావాల్సిన అన్ని రకాల వరి విత్తనాలతో పాటు వేరుశనగ విత్తనాలు కూడా మన జిల్లాలోనే అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది.

15వేల క్వింటాళ్ల సామర్థ్యం..

సుమారు 20వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ కేంద్రంలో 15 వేల క్వింటాళ్ల విత్తనాలు నిల్వ ఉంచుకోనే సామర్థ్యం ఉంది. విత్తనోత్పత్తి కేంద్రం పరిధిలోని రైతులు కేంద్రం ఇచ్చిన ఫౌండేషన్ సీడ్‌తో పంటను వేసుకొని ఆ పంటను విత్తనాలుగా విత్తనోత్పత్తి కేంద్రాలకు అమ్ముకుంటే 25 శాతం అధిక ఆదాయం వస్తుంది. మామూలు ధాన్యం బస్తా కంటే విత్తనాల బస్తా ధర ఎక్కువగా ఉంటుంది. ఈ కేంద్రం ద్వారా టెక్కలి డివిజన్‌లోని 45 వేల మంది రైతులకు సుమారు 75వేల ఎకరాల భూమికి కావాల్సిన విత్తనాలు తయారు చేసుకునే వీలుంటుంది. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు సొంత నియోజకవర్గంలోనే ఉన్న ఈ విత్తనోత్పత్తి కేంద్రం పనులు పూర్తయినా ప్రారంభానికి నోచుకోకపోవడంపై అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.



ఉన్నతాధికారుల ఆదేశాలతో..

విత్తనోత్పత్తి కేంద్రం పనులు పూర్తయ్యాయి. ఇటీవలే అధికారులు వచ్చి పరిశీలించి వెళ్లారు. ఈ నెలాఖరుకు కాంట్రాక్టర్ నుంచి హ్యాండోవర్ చేసుకుంటాం. అనంతరం ఉన్నతాధికారులు ఆదేశాలతో ప్రారంభిస్తాం..

– పి.బాలకృష్ణ, ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్

కారణమదేనా?

గత ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంజూరు చేసిన ఈ కేంద్రం ప్రారంభిస్తే ఆ క్రెడిట్ వైఎస్సార్ సీపీకి వెళుతుందనే కారణంతో ప్రారంభించకుండా కాలయాపన చేస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. రాజకీయంగా ఆలోచించకుండా జిల్లా రైతులకు ఉపయోగపడే ఇలాంటి కేంద్రాన్ని తక్షణమే ప్రారంభించాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు.

రూ.500 గుళికలు కొంటేనే యూరియా

- దోపిడీకి తెరతీసిన కొందరు డీలర్లు
- గగ్గోలు పెడుతున్న రైతులు



వెంకటాపురంలోని ప్రైవేటు ఎరువుల దుకాణం

రణస్థలం: ఓవైపు వర్షాలు లేక అల్లాడుతున్న రైతులకు మరోవైపు యూరియా కష్టాలు వెంటాడుతున్నాయి. రైతు సేవా కేంద్రాల ద్వారా యూరియా పంపిణీలో ప్రభుత్వం చేతులెత్తేయడంతో ఇదే అదనుగా కొందరు డీలర్లు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఇష్టారాజ్యంగా రేట్లు పెంచేస్తున్నారు. దీనికి తోడు అవసరం లేని గుళికలు అంటగడుతున్నారు. రూ.500 పెట్టి గుళికలు కొంటేనే యూరియా ఇస్తామని షరతులు పెడుతున్నారు. యూరియా బస్తా ప్రభుత్వ ధర రూ.266.50 ఉంటే ప్రయివేటు డీలర్లు రూ.350 వరకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. గుళికలు వద్దని చెబితే యూరియా లేదని పొమ్మనంటున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితి రణస్థలం, లావేరులో ఎక్కువగా ఉంది. శుక్రవారం లావేరు మండలం వెంకటాపురంలో యూరియా కొందామని ఇజ్జాడపాలెం, గోవిందపురం, లింగాలవలస గ్రామాల రైతులు ప్రైవేటు డీలర్ల వద్దకు వెళ్లగా యూరియా నిల్వలు ఉన్నా లేవని చెప్పి పంపించేశారు. దీంతో మండల వ్యవసాయాధికారి డి.మహేష్ నాయుడుకు ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన స్పందిస్తూ డీలర్లతో ఫోన్‌లో మాట్లాడానని.. శనివారం ఇస్తామని చెప్పారని, సెలవుల తరువాత పూర్తిగా సరిచేస్తామన్నారు.

సరిలేరు నీకెవ్వరు..!



అక్కా తమ్ముళ్లు తిరుపతమ్మ, ప్రసాదరావు

- కిడ్నీ సమస్య బారిన సోదరుడు
- స్వచ్ఛందంగా కిడ్నీ దానం చేసిన సోదరి
- రక్తసంబంధానికి సాక్షిగా నిలుస్తున్న అక్కాతమ్ముడు

నరసన్నపేట: ఎంతో ప్రేమగా చూసుకునే తమ్ముడు కిడ్నీ సమస్య బారిన పడ్డాడని తెలుసుకున్న ఆ సోదరి నిర్ఘాంతపోయింది. కిడ్నీ మార్చితే తప్ప ప్రాణం నిలవదని తెలిసి ఆవేదనతో కుమిలిపోయింది. మరో ఆలోచన లేకుండా తానే కిడ్నీ దానం చేసి స్ఫూర్తిగా నిలిచింది. నరసన్నపేట మండలం కుమ్మరిపేటలో 15 ఏళ్ల క్రితం జరిగిన ఈ ఘటన అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగానికి, రక్త సంబంధానికి సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. ప్రస్తుతం ఇద్దరూ ఎంతో ఆరోగ్యంగా ఉంటూ ఏటా రాఖీ పండగను ఘనంగా జరుపుకొంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కుమ్మరిపేట గ్రామానికి చెందిన వజ్జ రత్నం, చిన్నవాడులది రైతు కుటుంబం. వీరికి తిరుపతమ్మ, ప్రసాదరావు, మల్లేసు సంతానం. తల్లిదండ్రులు మరణించినా వీరి అనుబంధం ఇతరులకు ఆదర్శంగా కొనసాగుతోంది. జల్లు తిరుపతమ్మ తన కుమార్తె కాంచనను తమ్ముడు ప్రసాదరావుకు ఇచ్చి 2010 వివాహం చేసింది. కొద్ది రోజులు అయ్యే సరికి ప్రసాదరావుకు ఆరోగ్యం క్షీణించింది. వైద్యులను సంప్రదించగా కిడ్నీలు రెండూ పనిచేయడం లేదని, ఎక్కువ రోజులు జీవించడం కష్టమని చెప్పారు. ఎవరైనా కిడ్నీ ఇస్తే ఆపరేషన్ చేస్తామని స్పష్టం చేశారు. ఈ పరిస్థితిలో కిడ్నీ ఇచ్చేందుకు తిరుపతమ్మ ముందుకు రావడం, వైద్యులు పరీక్షలు చేసి కిడ్నీ అమర్చడం పూర్తి చేశారు. ఇప్పుడు ఇద్దరూ ఒక్కో కిడ్నీతోనే ఆరోగ్యంగా ఉన్నారు.

అక్క త్యాగమే..

నేను ఈ రోజు ఇలా జీవించి ఉన్నానంటే ఆనాడు అక్క చేసిన త్యాగమే. వెనకా ముందూ ఆలోచించకుండా తన శరీరంలో ప్రధాన అవయవమైన కిడ్నీని దానం చేసింది. నా ప్రాణం నిలిపింది.

– వజ్జ ప్రసాదరావు

బాధ్యతగా భావించా..

నాన్న, అమ్మ చనిపోయారు. నా తమ్ముళ్లకు నేను. నాకు వారు. ఈ ఉద్దేశంతోనే నా కుమార్తెను ప్రసాదరావు కిచ్చి వివాహం చేశాను. వారి జీవితం సాఫీగా సాగుతుందనుకొనే లోపే ప్రసాదరావు కిడ్నీలు పాడయ్యాయి. నా కిడ్నీ ఇచ్చి తమ్ముడిని కాపాడుకున్నాను.

– జల్లు తిరుపతమ్మ

పాలకులు కళ్లు తెరవాలని..



కళ్లకు గంతలు కట్టుకుని ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

ఎచ్చెర్ల : ఎచ్చెర్ల ఐఎంఎల్ డిపోను విభజించి టెక్కలిలో మరో డిపో ఏర్పాటు చేయడానికి జారీ చేసిన ఉత్తర్వులను వెంటనే ఉపసంహరించుకోవాలని హమాలీలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎచ్చెర్ల డిపో వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో హమాలీలు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. పాలకులు ఇప్పటికైనా కళ్లు తెరిచి తమకు న్యాయం చేయాలని కోరారు.

కాలువలు కనుమరుగు



ఆక్రమణకు గురైన సాగునీటి కాలువ



- పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో మాయమవుతున్న చెరువులు, సాగునీటి కాలవలు
- పట్టించుకోని అధికారులు

పలాస: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఖాళీ స్థలం కనిపిస్తే చాలు భూబకాసురులు కబ్జా చేస్తున్నారు. వీరి వల్ల వందలాది ఎకరాలకు సాగునీరు అందించాల్సిన సాగునీటి కాలువలు కనుమరుగవుతున్నాయి. ప్రభుత్వ చెరువులు మాయమవుతున్నాయి. డీ పట్టా భూములైతే ఆక్రమించుకొని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఇష్టానుసారంగా అమ్ముకుంటున్నారు. ఈ ఆక్రమణలపై మున్సిపల్ అధికారులకు, రెవెన్యూ అధికారులకు ప్రజల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా కనీసం పట్టించుకోవడం లేదు. అధికార పార్టీ అండదండలతో యథేచ్ఛగా ఆక్రమణలు జరుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. కాశీబుగ్గ పట్టణానికి అతి సమీపంలోని అంబుసోలి దోయిసాగరం సగం ఆక్రమణలకు గురైంది. ఒకప్పుడు జల కళతో కనువిందు చేసిన ఈ చెరువు చుట్టూ అక్రమ ఇళ్ల నిర్మాణాలతో నిండిపోతుంది. నెమలికొండ, సూదికొండ, పెంటిబద్ర కొండల నుంచి చిన్న చిన్న వరద కాలువల ద్వారా వర్షాకాలంలో ఈ చెరువుకు నీరు చేరుతుంది. దీంతో నర్సిపురం రెవెన్యూ పరిధిలోని సుమారు 300 ఎకరాలకు నీరు అందేది. అంతేకాకుండా పశువుల తాగునీటికి కూడా ఉపయోగపడేది. అలాంటి ఈ చెరువు రూపు రేఖలు మారిపోయాయి.

అలాగే పలాస దేశబట్టి నుంచి, వంశధార ఎడమ కాలువ నుంచి వచ్చిన నీటితో వర్షాకాలంలో ఎంతగానో ఉపయోగపడుతున్న జగన్నాథ సాగరం చెరువు కూడా దురాక్రమణలకు గురవుతోందని రైతుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒకప్పుడు పలాస జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు ఎదురుగా ఉన్నా డబ్బాల చెరువు ఇప్పుడు పూర్తిగా ఆక్రమణకు గురైంది. ఆ పక్కన ఉన్న శ్మశానాన్ని కూడా ఆక్రమించుకొని కొంతమంది రెవెన్యూ కార్యాలయం సాక్షిగా రియల్ ఎస్టేట్ వెంచర్ వేశారు. మొగిలిపాడు గ్రామం వద్ద గల నెమలి చెరువు నుంచి పురుషోత్తపురం ఎర్ర చెరువుకు వెళ్లే సాగునీటి సాగునీటి కాలువపై ఆ గ్రామ సమీపంలోని శ్మశానం వద్ద కాలువను ఆక్రమించుకొని ఇళ్లు కట్టుకుంటున్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు దృష్టికి స్థానికులు తీసుకొని వెళ్లినా తూతూ మంత్రంగా పరిశీలించి వదిలేశారు. ఆ ఇంటిని తొలగించకపోవడంతో ఇళ్ల నిర్మాణం యథాతథంగా సాగుతోందని ఆ గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటిపై పలాస తహసీల్దార్ టి.కల్యాణచక్రవర్తిని వివరణ కోరగా ప్రత్యేక రెవెన్యూ బృందాలను పరిశీలనకు పంపించామని వాటిని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.



అంబుసోలి దోయసాగరం

ఉద్యోగులకు 'పీపీపీ' సర్వే షాక్

- ఆదిత్యాలయ పరిధిలో శానిటేషన్ నిర్వహణ బాగోలేదని ఫీడ్‌బ్యాక్
- సీనియర్ అసిస్టెంట్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు
- విస్మయం చెందుతున్న సిబ్బంది



అరసవల్లి ఆదిత్యాలయం

అరసవల్లి: కూటమి ప్రభుత్వం తెచ్చిన సర్వేలు ఉద్యోగుల కొంపముంచుతున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రముఖ దేవాలయాల్లో దర్శనాలు, పారిశుద్ధ్యం, సౌకర్యాలు, అన్నదాన ప్రసాదాలతో పాటు సిబ్బంది చేపడుతున్న చర్యలపై భక్తుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకునే విధానం (సానుకూల ప్రజా అవగాహన) మొదలైన సంగతి విదితమే. ఈ క్రమంలో అరసవల్లి సూర్యనారాయణ స్వామిఆలయంలో కూడా పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ (పీపీపీ) పేరిట జరుగుతున్న ఈ సర్వేల్లో భక్తుల అభిప్రాయాలన్నీ నమోదవుతుంటాయి. ఇదే క్రమంలో ప్రసాదాలు, సౌకర్యాలు, దర్శనాలు, పారిశుద్ధ్యం నిర్వహణలో గత మే, జూలై నెలల్లో భక్తుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకున్నారు. ఇందులో పారిశుద్ధ్య నిర్వహణపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో సంబంధిత విభాగాన్ని పర్యవేక్షిస్తున్న సీనియర్ అసిస్టెంట్ శోభనాద్రాచార్యులను విధుల నుంచి సస్పెండ్ చేయాలని ఆదేశించారు. ఈ మేరకు ఆలయ ఈవో కె.ఎన్.వి.డి.వి.ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే సర్వే ఆధారంగా ఏకంగా విధుల నుంచి సస్పెన్షన్ చేయడంపై ఆలయ వర్గాలు విస్మయానికి గురవుతున్నారు.

ఎలా సాధ్యం?

సూర్యనారాయణ స్వామి ఆలయం అరసవల్లి గ్రామంలో భాగంగా ఉందన్న సంగతి తెలిసిందే. ప్రధాన రహదారికి ఆనుకుని ఉండటంతో పాటు ఆలయమంతా ఒకే ప్రాకారంలో లేకపోవడంతో బయట పారిశుద్ధ్య నిర్వహణ, పర్యవేక్షణ ఆలయ ఉద్యోగులకు సాధ్యం కాదు. పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేకంగా సిబ్బంది నియామకాలు చేపట్టలేదు. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న నలుగురు రెగ్యులర్ ఉద్యోగులపై ఇలాంటి చర్యలు చేపట్టడం తగదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా పనికొచ్చే సర్వేలు చేపడితే బాగుంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

క్లుప్తంగా

ఐటీడీఏ సాధనే లక్ష్యం


యోగేశ్వరరావు

సారవకోట: జిల్లాలోని మెళియాపుట్టిలో ఐటీడీఏ ఏర్పాటు సాధనే శనివారం జరగనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవ లక్ష్యమని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ముఖ్య ఉద్దేశాన్ని ప్రస్తుత పాలకులు మరచిపోయి దీనిని ఒక జాతర, లేదా పండుగా నిర్వహిస్తున్నారని, అయితే అసలైన లక్ష్యం నెరవేర్చడం లేదని ఆరోపించారు. అభివృద్ధి పేరుతో జరుగుతున్న విధ్వంసం ఆదివాసీల జీవితాల పాలిట శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా నేటికీ కనీస మౌలిక వసతులు లేని గిరిజన గ్రామాలున్నాయన్నారు. సీతంపేట ఐటీడీఏ పార్వతీపురం మన్యం జిల్లాలో విలీనం చేసిన తర్వాత, శ్రీకాకుళం జిల్లాలో ఉన్న 16 మండలాల్లోని 2 లక్షల మంది గిరిజనులకు ఇబ్బందులు వస్తున్నాయన్నారు. అందువలన ఇప్పటికైనా అధికారులు స్పందించి మెళియాపుట్టి మండలంలో ఐటీడీఏ ఏర్పాటు చేయాలని కోరారు.

రైతు బిడ్డకి డాక్టరేట్


ఎల్.ప్రసాదరావు

శ్రీకాకుళం న్యూకాలనీ: కాకినాడ జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూకే) నుంచి జిల్లాకు చెందిన లింగాల ప్రసాదరావు పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. 'శ్రీకాకుళం జిల్లా బ్యాంకింగ్ రంగంలో మానవ మూలధనం మరియు పనితీరుపై ఒక అంచనా' అనే శీర్షికతో ఆయన చేసిన పరిశోధన విజయవంతంగా పూర్తి చేశారు. జేఎన్‌టీయూకే మేనేజ్‌మెంట్ స్టడీస్ మాజీ డైరెక్టర్ డాక్టర్ పి.విజయ్‌కుమార్, అదే వర్సిటీకి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.చార్వక్ మార్గదర్శకత్వంలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ప్రసాద్ విజయనగరంలోని లెండి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. వ్యవసాయ కుటుంబంలో జన్మించిన ప్రసాదరావు స్వగ్రామం పొందూరు మండలంలోని కేశవదాసుపురం గ్రామం. తల్లిదండ్రులు లింగాల ఆసిరప్పుడు, పార్వతి, భార్య శాంతి ప్రోత్సాహం, మద్దతను మర్చిపోలేనన్నారు. తన పీహెచ్‌డీ పట్టాను తమ కుటుంబ సభ్యులకు అంకితం చేస్తున్నట్టు తెలియజేశారు.

గూడ్స్ గోదాం పరిశీలన


అవేజ్ గోదాంలో ఎరువులు పరిశీలిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

ఆమదాలవలస: శ్రీకాకుళం రోడ్(ఆమదాలవలస) రైల్వేస్టేషన్ పరిధిలోని గూడ్స్ గోదాం, అవేజ్ రాక్ గోదాంను శ్రీకాకుళం జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ శుక్రవారం పరిశీలించారు. సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించి ఎరువుల పక్కదారిపై ఆరా తీశారు. అవేజ్ ర్యాక్ గోదాంకు సంబంధించి అధికారులను ప్రశ్నించారు. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లాలకు సంబంధించి 1,320 మెట్రిక్ టన్నుల ఎరువులు వచ్చాయని తెలియజేశారు. ప్రైవేటు డీలర్లకు 660 మెట్రిక్ టన్నులు, మార్క్‌ఫెడ్‌కు 660 మెట్రిక్ టన్నులు పంపించినట్లు లెక్కలు చూపించారు. అయితే ప్రైవేటు డీలర్లకు ఎవరెవరికి ఎన్ని బస్తాలు వెళ్లాయో వివరాలు పంపించాలని డీఏవో త్రినాథస్వామికి సూచించారు. రాక్, మార్క్‌ఫెడ్ అధికారులు అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పరిశీలనలో మార్క్‌ఫెడ్ డీఎం రమణి, తహసీల్దారు రాంబాబు, ఏవో మెట్ట మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాలకు వైద్యుల సాయం


వైద్యులతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పీ–4 కార్యక్రమానికి డాక్టర్లు మద్దతు పలికారు. జిల్లాలోని బంగారు కుటుంబాలకు అండగా నిలుస్తామన్నారు. ఈ మేరకు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను శుక్రవారం వారి కార్యాలయంలో వివిధ రంగాలకు చెందిన 85 మంది వైద్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని 2,580 బంగారు కుటుంబాలకు తాము మార్గదర్శకులుగా నిలుస్తామని హామీ ఇచ్చారు. దీంతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వైద్యులను అభినందిస్తూ, సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సనపల నర్సింహమూర్తి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ నూర్తి కల్యాణ్ చక్రవర్తి, డాక్టర్ భవానీ, డాక్టర్ శిరీష, డాక్టర్ అరవింద్, డాక్టర్ రేవతి, పిల్లల వైద్యుడు డాక్టర్ వినోద్ తదితరులు పాల్గొన్నారు.



పీజీ... వెరీ లేజీ..!

- ఫలితాలు విడుదలైనా.. ప్రవేశాలు జరగని వైనం
- ఇప్పటికీ వెబ్ ఆప్షన్లు ఇవ్వని ప్రభుత్వం
- దిక్కుతోచని స్థితిలో విద్యార్థులు

ఎచ్చెర్ల:

డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించాలనే ఉద్దేశంతో పీజీ ప్రవేశ పరీక్షలు రాశారు. అయితే పీజీతో చక్కని భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలనే ఆశతో ఎదురుచూస్తున్న సమయంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నిర్లక్ష్యంతో వీరంతా ఏం చేయాలో తెలియని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. జూన్ 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకు పీజీ ప్రవేశ పరీక్షలను నిర్వహించారు. జూన్ 25 తేదీన ఫలితాలు కూడా వెల్లడించారు. అయితే తదుపరి చర్యలను చేపట్టలేదు. వెబ్ ఆప్షన్‌పై ఉన్నత విద్యా మండలి స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో ఎప్పుడు ప్రవేశాలు కల్పిస్తారో తెలియక విద్యార్థులు ఆయోమయ పరిస్థితిలో ఉన్నారు.

అగమ్యగోచరం

ఏపీ పీజీసెట్ రాసిన విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారయ్యింది. ఈ పరీక్ష రాసి పీజీలో చేరతామనే ఉద్దేశంతో మరే పరీక్ష రాయని వీరంతా పీజీ ప్రవేశాల కోసం ఎదురు చూస్తున్నారు. వాస్తవానికి ఆగస్టు నుంచి తరగతులు ప్రారంభమవ్వాల్సి ఉంది. కానీ ఇప్పటివరకూ వెబ్ ఆప్షన్స్ ఇవ్వలేదు. ఇప్పుడు ఇచ్చినా మొదటి కౌన్సిలింగ్, రెండు, మూడో కౌన్సిలింగ్ అని చాలా కాలం పట్టే అవకాశం ఉంది. దీనివలన విద్యార్థులతో పాటు విద్యాసంస్థలు కూడా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి దాపురించింది. విద్యా సంవత్సరం టైం టేబుల్ వేయడానికి విద్యాసంస్థలు కూడా ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

వీసీలతో సమావేశాలేవీ..?

సాధారణంగా ప్రతీ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని వర్సిటీల వీసీలు, రిజిస్ట్రార్‌లతో సమావేశం నిర్వహించాల్సి ఉంటుంది. వర్సిటీల్లో ఉన్న సమస్యలు, కోర్సులు, అవసరమైన నిధులపై చర్చించాల్సి ఉంది. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో ఒకసారి కూడా వీసీలు, రిజిస్ట్రార్లతో సమావేశం నిర్వహించిన దాఖలాలు లేవు. ఉన్నత విద్యా మండలి ముఖ్య కార్యదర్శి, చైర్మన్, విద్యాశాఖ మంత్రి, వీసీలతో ప్రతీ ఏడాది సమావేశం నిర్వహించాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది దాటినా ఇటువంటి సమావేశాలను ఇప్పటివరకూ నిర్వహించలేదు. రాష్ట్రంలో 18 వర్సిటీలు ఉండగా వీరిలో ఎచ్చెర్ల మినహా 17 మంది వీసీలు రాజీనామాలు కూడా చేశారు. వీరిలో 9 మందిని కొత్తగా రిక్రూట్ చేయగా, మిగిలిన చోట్ల ఇన్‌చార్జి వీసీలు కొనసాగుతున్నారు. వీసీలతో సమావేశం నిర్వహిస్తే, వారు సమస్యలు చెబితే నిధులు కేటాయించాల్సి వస్తుందని కూటమి ప్రభుత్వం సమావేశాలను నిర్వహించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నారు.

వేంకటేశ్వర వర్సిటీకి బాధ్యతలు

పీజీ ప్రవేశాలకు సంబంధించి రాష్ట్రంలో ఉన్న అన్ని వర్సిటీలు, అనుబంధ కళాశాలల్లో ప్రవేశాలకు తిరుపతి వేంకటేశ్వర వర్సిటీకి బాధ్యతలు అప్పగించారు. ఇదివరకు ఎచ్చెర్ల, రాజమండ్రి, ఏయూ కలిపి ఏయూకు ప్రవేశాల బాధ్యతను అప్పగించేవారు. తర్వాత ఏ వర్సిటీకి సంబంధించి ఆ వర్సిటీ ప్రవేశాలను కల్పించేది. కాగా ఇప్పుడు రాష్ట్ర మొత్తంగా ఒకే వర్సిటీ ప్రవేశాలను కల్పిస్తోంది. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో ఈ ప్రవేశాలను నిర్వహిస్తున్నారు. అయితే వీరు స్పందించకపోవడంతో ఇంతవరకూ ప్రవేశాలకు సంబంధించి ఎటువంటి స్టేట్‌మెంట్ విడుదల చేయలేదు.

బీఆర్‌ఏయూలో సీట్లు

కోర్సులు	సీట్లు	
	రెగ్యులర్	సెల్ఫ్ ఫైనాన్స్
ఎం.కాం	40	0
ఎంఏ ఎకనామిక్స్	32	8
ఎంఏ ఇంగ్లిష్	32	8
ఎంఎల్ఐఎస్‌సీ (లైబ్రరీయన్, ఇన్ఫర్మేషన్ సైన్సెస్	32	8
ఎంఏ సోషల్ వర్క్	32	8
ఎంఏ తెలుగు	32	8
ఎంఏ రూరల్ డవలప్‌మెంట్	32	8
ఏఈడీ	32	8
ఎంజేఎంసీ	24	6
ఎంఏ ఫిలాసఫీ	0	20
ఎంఎస్సీ బయోటెక్నాలజీ	24	6
ఎంఎస్సీ మైక్రో బయాలజీ	16	4
ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ	16	4
ఎంఎస్సీ మ్యాథమెటిక్స్	32	8
ఎంఎస్సీ అప్లయిడ్ మ్యాథమెటిక్స్	16	4
ఎంఎస్సీ ఫిజిక్స్	32	8
ఎంఎస్సీ జియోఫిజిక్స్	12	3
ఎంఎస్సీ జియాలజీ	12	3

మరిన్ని సెట్లలో ఆలస్యం

రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఏపీపీజీ సెట్‌తో పాటు లా సెట్, ఎడ్ సెట్ విద్యార్థులకు కూడా ప్రవేశాలకు సంబంధించి ఎటువంటి స్పష్టత ప్రభుత్వం ఇవ్వలేదు. వీరంతా ప్రవేశ పరీక్షలను రాసి ప్రవేశాల కోసం ఎదురు చూస్తున్నారు. జిల్లాలో రెండు లా కళాశాలలు ఉన్నాయి. 15 బీఈడీ కళాశాలలు ఉన్నాయి. ఈ కళాశాలల్లో చేరేందుకు ఈ విద్యార్థులంతా ఎదురు చూస్తున్నారు. ఐసెట్, ఇంజినీరింగ్ సెట్ ప్రవేశాలను మాత్రమే పూర్తి చేశారు. మిగతా సెట్ పరీక్షలన్నీ అలానే ఉన్నాయి.

వెబ్ ఆప్షన్స్ ఇంకా ఇవ్వలేదు



రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో ఈ ప్రవేశాలను నిర్వహించడం జరుగుతుంది. వీటికి సంబంధించి ఇంకా వెబ్ ఆప్షన్స్ ఇవ్వలేదు. రాష్ట్రం మొత్తం మీద ఈ సమస్య ఉంది. ఈ నెలలో ఇచ్చే అవకాశం ఉంది. ప్రవేశాలకు అనుగుణంగా విద్యా సంవత్సరం క్యాలెండర్ తయారు చేయనున్నాము. ప్రవేశాల జాప్యం సమస్య లేకుండా విద్యార్థులకు విద్యను అందించేందుకు ప్రయత్నిస్తాం.

– పి.సుజాత, రిజిస్ట్రార్, బీఆర్‌ఏయూ

మత్స్యకారులపై కేసులు ఎత్తివేయాలి


నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

అరసవల్లి: అనకాపల్లి జిల్లా నక్కపల్లి వద్ద కెమికల్ ఫ్యాక్టరీ వల్ల మత్స్య సంపద నాశనమవుతోందని పోరాటం చేస్తున్న మత్స్యకారులపై రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు కేసులు బనాయించిందని, ఈ కేసులను తక్షణమే ఎత్తివేయాలని జిల్లా మత్స్యకార ఎస్టీ సాధన సమితి అధ్యక్షుడు మైలపల్లి పోలీసు డిమాండ్ చేశారు. నగరంలోని భూపాలరావువీధిలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్స్య సంపదను కాపాడాల్సిన ప్రభుత్వం.. కెమికల్ కార్పొరేట్ శక్తులతో చేతులుకలిపి మత్స్యకారులను బెదిరించడం సరికాదన్నారు. అక్రమ కేసులు బనాయించడాన్ని జిల్లా శాఖ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రకటించారు. అక్రమ కేసులు ఎత్తివేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు కార్యచరణ సిద్ధం చేస్తామని హెచ్చరించారు. ఆయనతో పాటు జిల్లా సంఘ ముఖ్య నేతలు ఇద్ది పాపయ్య, గుండాల గణేష్‌కుమార్, కొండా సింహాచలం, మైలపల్లి పోలీస్, సూరాడ లక్ష్మణ, మోసా ఫల్గుణరాజు, మైలపల్లి నర్సింహమూర్తి, మూగి శ్రీరామమూర్తి ఉన్నారు.

క్విట్ కార్పొరేట్ డే జయప్రదం చేయండి


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విధానాలకు నిరసనగా ఆగస్టు 13న నిర్వహించనున్న క్విట్ కార్పొరేట్ డేను జయప్రదం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్ తాండ్ర ప్రకాష్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.సింహాచలం, కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి పోలాకి ప్రసాదరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొత్స సంతోష్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు డి.చందు, పి.ఖగేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శ్రీకాకుళంలోని సీఐటీయూ కార్యాలయంలో కరపత్రాలు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడోసారి అధికారం చేపట్టిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రద్దయిన 3 నల్లచట్టాల కన్నా ప్రమాదకరమైన విధానాలను ప్రకటించిందని విమర్శించారు. వ్యవసాయ మార్కెట్ల చట్టాన్ని విదేశీ, స్వదేశీ కంపెనీల ఎగుమతి, దిగుమతి వ్యాపారుల ప్రయోజనాలకు అనుగుణంగా మార్పులు చేసిందని దుయ్యబట్టారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు, రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల రుణాలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనుల హక్కులు కాపాడాలని, జీడి పంటకు మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, ప్రీపెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఉపసంహరించుకోవాలని కోరారు.

సెల్‌ఫోన్ తెచ్చిన తంటా

- స్నేహితుల మధ్య గొడవ


చికిత్స పొందుతున్న దుర్గాప్రసాద్

సరుబుజ్జిలి: ఇద్దరి ప్రాణ స్నేహితుల మధ్య సెల్‌ఫోన్ వలన జరిగిన గొడవ కొట్లాటకు దారి తీసింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని నందికొండ కాలనీకి చెందిన పల్లి వీరవెంకటదుర్గాప్రసాద్, బప్పడాం గ్రామానికి చెందిన పేడాడ శ్రీధర్‌లు ప్రాణ స్నేహితులు. ఇటీవల దుర్గాప్రసాద్ సెల్‌ఫోన్‌ను శ్రీధర్ తీసుకున్నాడు. అయితే తన ఫోన్ తిరిగి ఇవ్వాలని దుర్గాప్రసాద్ అడగడంతో ఏఎల్‌నగరం మిల్క్ సెంటర్ వద్దకు వస్తే మాట్లాడుదామని శ్రీధర్ చెప్పడంతో దుర్గాప్రసాద్ గురువారం రాత్రి మరో వ్యక్తిని తీసుకొని అక్కడికి వెళ్లాడు. అనంతరం తన ఇంటికి రావాలని శ్రీధర్ కోరడంతో బప్పడాం వెళ్లారు. అయితే అక్కడ వారి ఇరువురి మధ్య గొడవ జరిగింది. ఈ ఘర్షణలో దుర్గాప్రసాదుకు శరీరంపై పలుచోట్లు కత్తిపోట్లు కావడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్తులు అక్కడి పరిస్థితిని పోలీసులకు తెలియజేయడంతో ఆమదాలవలస సీఐ సత్యనారాయణ, ఎస్ఐ హైమావతితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే దుర్గాప్రసాద్‌ను చికిత్స కోసం 108లో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. అనంతరం ఉన్నత చికిత్స కోసం వైద్యులు విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. నిందితుడు శ్రీధర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ బి.హైమావతి తెలిపారు.

దరఖాస్తులు ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్: రాష్ట్రవ్యాప్తంగా త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించేందుకు ఆర్టీసీ సిద్ధమవుతున్న నేపథ్యంలో శ్రీకాకుళం జిల్లా పరిధిలో దినసరి వేతనంతో ఆన్ కాల్ (హోల్డింగ్) డ్రైవర్లుగా పని చేసేందుకు ఆసక్తి ఉన్నవారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి జిల్లా ప్రజా రవాణాధికారి హనుమంతు అమరసింహుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారు శ్రీకాకుళం-1, శ్రీకాకుళం-2 డిపోలతో పాటు పలాస, టెక్కలి డిపోల పరిధిలో విధులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. డ్రైవర్లకు 55 సంవత్సరాల్లోపు వయసు, హెవీ లైసెన్సుతో పాటు 18 నెలల పాటు రవాణా వాహనం నడిపిన అనుభవం ఉండాలన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు దగ్గరలోని డిపోల్లో సంప్రదించాలని సూచించారు. అలాగే అసిస్టెంట్ మెకానిక్, శ్రామిక్‌లుగా పనిచేయడానికి అవుట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా సంప్రదించాలన్నారు. శ్రామిక్‌లు ఐటీఐ (డీజిల్ మెకానిక్ (ట్రేడ్) ఉత్తీర్ణత సాధించి, అప్రెంటిషిప్ చేసి ఉండాలన్నారు.

18 నుంచి జ్ఞాన ప్రవచన యజ్ఞం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని బాపూజీ కళామందిర్‌లో ఈనెల 18వ తేదీ నుంచి 23 వరకు జ్ఞాన ప్రవచన యజ్ఞం, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు జరగనున్నాయని చిన్మయ మిషన్ నిర్వాహకులు స్వామీ పరాత్మానంద సరస్వతీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఢిల్లీ చిన్మయ మిషన్ నిర్వాహకులు స్వామి చిద్రూపానంద సరస్వతీచే ఉదయం ఉపనిషత్తుపై, సాయంత్ర మహా భారతంపై ప్రవచనాలు జరుగుతాయని పేర్కొన్నారు. మొదటి రోజున శోభా కార్యక్రమం సాయంత్రం ఉంటుందని తెలిపారు.

ఉత్సాహంగా 5కే రన్


5కే రన్ పోటీలు ప్రారంభిస్తున్న రోటరీ ప్రతినిధులు

ఇచ్ఛాపురం: స్థానిక రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో 5కే రన్ పోటీలను శుక్రవారం నిర్వహించారు. పోటీల్లో యువత, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు డా.మోహన్‌వెంకటేష్ మాట్లాడుతూ యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు 5కే రన్ పోటీలు నిర్వహించామన్నారు. ఈ పోటీల్లో బాలికల విభాగంలో జి.యామిని, ఎం.హారిక, సీహెచ్ పుష్ప, బాలురు విభాగంలో ఆర్.సాయి, ఆర్.పవన్, పి.రాకేష్‌లు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు కె.రామ్మూర్తి, డా.త్రినాథ్ రెడ్డి, బి.షణ్ముఖ, కె.రామారావు, డి.కృష్ణమూర్తి, గోపి చౌదరి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదం


అగ్ని ప్రమాదంలో బూడిదైన నెట్‌వర్క్ మిషన్

మందస: మండల కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ టెలిఫోన్ ఎక్సేంజ్ కార్యాలయంలో గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో టెలిఫోన్ నెట్‌వర్క్ పరికరాలు కాలి బూడిదయ్యాయి. ఈ కార్యాలయం నివాస గృహాల మధ్యలో ఉండడం వలన మంటలు చెలరేగడం, పొగలు వ్యాపించడంతో ప్రజలు ఆందోళన చెందారు. ప్రమాదంలో ఎంత మేరకు నష్టం వాటిల్లిందో బీఎస్ఎన్ఎల్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. శుక్రవారం ఉదయం కార్యాలయాన్ని ఉన్నతాధికారులు పరిశీలించారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి


సీతమ్మ(ఫైల్)


మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

సోంపేట: మండలంలోని జింకిభద్ర గ్రామానికి చెందిన కూనే సీతమ్మ (58) శుక్రవారం ఉదయం బెంకిలి సాదుమెట్ట వద్ద విద్యుత్ షాక్‌తో మృతి చెందింది. సోంపేట పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సీతమ్మ ప్రతిరోజూ ఉదయం సాదు మెట్ట మీద ఉన్న ఆంజనేయ స్వామి దేవాలయం పరిసరాలు శుభ్రం చేసి, స్వామివారికి దీపం పెట్టి ఇంటికి వెళ్తుంది. ఇంటికి వెళ్లేటప్పుడు పూజకు పనికొచ్చే పూలను తీసుకెళ్లి బెంకిలి, జింకిభద్ర గ్రామాల్లో పలువురికి ఇచ్చేది. ప్రతిరోజూ మాదిరిగానే శుక్రవారం ఉదయం 6.30 గంటల సమయంలో సీతమ్మ సాదు మెట్టకు చేరుకుంది. స్వామివారికి దీపం పెట్టడానికి ముందు పూలు కోయడానికి చెట్టు వద్దకు వెళ్లింది. అయితే అక్కడ విద్యుత్ దీపాలంకరణ కోసం ఏర్పాటు చేసిన చిన్న పోల్‌ను పట్టుకోవడంతో కేకలు వేస్తూ కుప్పకూలింది. అక్కడ యోగా నేర్చుకుంటున్నవారు వచ్చి 108కు సమాచారం అందించారు. 108 సిబ్బంది వచ్చి పరిశీలించి ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. అయితే విద్యుత్ షాక్‌తోనే మహిళ మృతి చెందినట్లు స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి విద్యుత్ అధికారులు, పోలీసులు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం జరుగుతుందని సోంపేట ఎస్ఐ వి.లోవరాజు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక సామాజిక ఆస్పత్రికి తరలించారు. సీతమ్మకు వివాహ బంధంలో చిన్నపాటి గొడవలు రావడంతో, తన మేనల్లుడి ఇంటి వద్దనే గత 30 సంవత్సరాలుగా ఉంటోంది. అందరికీ చేదోడు, వాదోడుగా ఉండే సీతమ్మ మృతితో బెంకిలి, జింకిభద్ర గ్రామాల్లో విషాద చాయలు అలముకున్నాయి.

నారాయణ పర్యటన విజయవంతం చేయండి

వజ్రపుకొత్తూరు రూరల్/మందస: ఉద్దాన ప్రాంతంలో నిర్మించనున్న కార్గో ఎయిర్ పోర్టుకు వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమానికి సంఘీభావంగా ఈనెల 12వ తేదీన సీపీఐ జాతీయ నేత నారాయణ ఈ ప్రాంతంలో పర్యటించనున్నట్లు కార్గో ఎయిర్‌పోర్టు వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమర వాసు, జోగి అప్పారావు తెలిపారు. ఒంకులూరు గ్రామంలో శుక్రవా రం వారు మాట్లాడుతూ ఎయిర్ పోర్టు నిర్మిస్తే ఉద్దాన ప్రజలు జీవనోపాధిని కోల్పోతారని ఆవేదన వ్యక్తం చేశారు. పచ్చని ఉద్దానాన్ని కాపాడుకోవడానికి ఐక్యమత్యంగా పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. ఉద్యమానికి ప్రజా సంఘాలు, వామపక్ష నాయకులు అండగా నిలవడంపై కృతజ్ఞతలు తెలియజేశారు. పర్యటనలో ప్రజా సంఘాల నాయకులు, వామపక్ష నాయకులు, బాధిత రైతులు, పర్యావరణ ప్రేమికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ట్రస్ట్ బోర్డులకు గ్రీన్ సిగ్నల్



అరసవల్లి: జిల్లాలోని ప్రసిద్ధ అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయం, శ్రీకూర్మంలోని శ్రీకూర్మనాథ స్వామివారి ఆలయాల్లో పాలక మండలి నియామకాలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు దేవదాయశాఖ ఉన్నతాధికారులు పలు సూచనలు, నిబంధనలను ప్రకటిస్తూ నోటిఫికేషన్ విడుదల చేశారు. రూ.కోటి నుంచి రూ.5 కోట్లలోపు వార్షికాదాయం ఉన్న శ్రీకూర్మం ఆలయంలో 9 మంది, రూ.5 కోట్లు నుంచి రూ.20 కోట్ల లోపు వార్షికాదాయం ఉన్న అరసవల్లి సూర్యక్షేత్రంలో 12 మంది సభ్యులతో పాలకమండలి సభ్యులను నియమించనున్నారు. అయితే అరసవల్లి ఆలయానికి వంశపారంపర్యంగా ఇప్పిలి జోగిసన్యాసిరావు ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా, శ్రీకూర్మం ఆలయానికి వంశపారంపర్య ధర్మకర్తగా విజయనగరానికి చెందిన గవర్నర్ పూసపాటి అశోక్‌గజపతిరాజు ట్రస్టు బోర్డు చైర్మన్‌గా కొనసాగనున్నారు. దీంతో పాలకమండలి సభ్యుల స్థానాలు మాత్రమే భర్తీ కానున్నాయి. గురువారం సాయంత్రం నోటిఫికేషన్ విడుదల చేయడంతో, ఆసక్తి ఉన్నవారు తమ అర్హతలతో రానున్న 20 రోజుల్లోగా ఆయా ఆలయాల కార్యనిర్వహణాధికారులకు దరఖాస్తులను సమర్పించాలని జిల్లా దేవదాయ శాఖాధికారి ప్రసాద్‌పట్నాయక్ తెలియజేశారు.

ఎండుతున్న నారు.. రైతు కంట కన్నీరు



గత కొన్ని రోజులుగా చినుకు మొఖం చాటేయడంతో వరినారు ఎండుతోంది. దీంతో ఆకాశం వైపు చూస్తూ అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. ముఖ్యంగా లావేరు, రణస్థలం మండలాల్లోని వర్షాభావ పరిస్థితులు, తోటపల్లి కాలువ ద్వారా నీరు రాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పొలాలు దుక్కిదున్ని, నారుమడులు వేసే సమయానికి సాగునీరు లేక నానా కష్టాలు పడుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తోటపల్లి కాలువ సాగునీరు వచ్చేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

– రణస్థలం